రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు కరువు



షెల్టర్లు లేకపోవడంతో ప్లాట్‌ఫారంపై నిల్చున్న ప్రయాణికులు



వర్షం రావడంతో టికెట్ బుకింగ్ రూమ్ వద్దకు పరుగులు తీస్తున్న దృశ్యం



టికెట్ బుకింగ్ రూమ్‌లో తలదాచుకున్న ప్రయాణికులు

గుత్తి: రైల్వే స్టేషన్‌లో మౌలిక సౌకర్యాలు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గుత్తిలోని కర్నూలు రోడ్డులో రైల్వే ఉన్నతాధికారులు సుమారు రూ.50 కోట్లు వెచ్చించి రైల్వే స్టేషన్ (ఫోర్టు రైల్వే స్టేషన్) నిర్మించారు. అయితే ప్రయాణికులు రైళ్ల కోసం వేచి ఉండటానికి కనీసం షెల్టర్లు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఎండకు, వానకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది క్రితం రైల్వే ఉన్నతాధికారులు సుమారు రూ. 50 కోట్లు వెచ్చించి రైల్వే స్టేషన్ నిర్మించారు. అయితే ప్లాట్‌ఫారంపై ప్రయాణికులు కూర్చోవడానికి కనీసం బెంచీలు లేవు.. వేచి ఉండటానికి షెల్టర్లు లేవు. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో జలుబు, జ్వరం వచ్చే అవకాశముందని ప్రయాణికులు వాపోతున్నారు. వర్షం వస్తే టికెట్ బుకింగ్ గదిలోకి దూరిపోతున్నారు. ఆ గది చిన్నదిగా ఉండటంతో కనీసం పట్టుమని ముప్పై మంది కూడా పట్టడం లేదు. అదీగాక అక్కడ టికెట్లకు వసూలైన డబ్బుకు రక్షణ లేకుండా పోతోంది. రైల్వే అధికారులకు ఆదాయం కావాలి.. కానీ మేము వేచి ఉండటానికి కనీసం షెల్టర్లు కూడా ఏర్పాటు చేసే చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రయాణికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రయాణికులకు కనీస సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత రైల్వే అధికారులపై ఉంది. సంబంధిత రైల్వే అధికారులు స్పందించి షెల్టర్లు, బెంచీలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రజాస్వామ్యంపై దాడి చేశారు

గుంతకల్లుటౌన్: విజయవాడలోని స్వరాజ్ మైదానంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకంపై జరిగిన దాడిని రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా పరిగణించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాస్ అన్నారు. ఆదివారం మెయిన్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట మాదిగ దండోరా, ఎమ్మార్పీఎస్ నాయకులు తమ కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో రూ.400 కోట్లు వెచ్చించి సామాజిక న్యాయానికి ప్రతిరూపంగా భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పితే, జీర్ణించుకోలేని కొందరు దుండగులు శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం సిగ్గుచేటన్నారు. ఈ దుశ్చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ కార్యదర్శి పక్కీరప్ప, మండల ఉపాధ్యక్షుడు ఇసాక్, నర్సప్ప, దండోరా సీనియర్ నాయకులు రాముడు, బాబూరావు, రాజేష్, భాస్కర్, మధు తదితరులు పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వైభవంగా ముత్యాలమ్మ జాతర





ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న దృశ్యం, బోనాలు, పట్టు వస్త్రాలు ఊరేగిస్తున్న భక్తులు

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని బండిమోటు వీధిలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ముత్యాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం వరకూ విశేష పూజలు చేశారు. పంచామృతాభిషేకం, స్వర్ణ, గంధ, పసుపు, కుంకుమలతో అభిషేకం అనంతరం అమ్మవారికి పట్టు పీతాంబరాలు, పూలతో అలంకరించి కుంభాభిషేకం నిర్వహించారు. బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. పల్లకీలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పుర వీధుల్లో గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో స్థానికులతో పాటు చుట్టుపక్కల మండలాల ప్రజలు, భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు. కార్యక్రమంలో ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధరన్, సుబ్బరాయుడు నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా



ప్రారంభానికి నోచుకోని జూనియర్ కళాశాల భవనం

పుట్లూరు: ఇంటర్ విద్యార్థుల కోసం నిర్మించిన జూనియర్ కళాశాల ప్రారంభానికి నోచుకోక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల సమీపంలో జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం తొమ్మిదేళ్ల క్రితం 2012లో రూ.కోటి వ్యయంతో నూతన భవనాన్ని నిర్మించారు. భవన నిర్మాణం పూర్తయినప్పటికీ కళాశాలను ప్రారంభించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో మండలంలోని విద్యార్థులు ఇంటర్ చదవటానికి తాడిపత్రి, అనంతపురం తదితర పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా భవనాన్ని ఎంపీడీఓ కార్యాలయం కోసం వినియోగిస్తామని ఒకరు...వ్యవసాయ గోడౌన్‌గా వినియోగిస్తామని మరొకరు...ఎస్సీ వసతి గృహం కోసం వినియోగంలోకి తీసుకొస్తామని పాలకులు చెబుతున్నారు. కాగా భవనం లోపల ముళ్ల పొదలు పెరగడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కొన్నేళ్ల క్రితం ఈ భవనంలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం అప్పట్లో సంచలనంగా మారింది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి కళాశాల భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు.

అశ్వత్థం క్షేత్రానికి పోటెత్తిన భక్తులు





అలంకరణలో శింగరబట్టు, గణపతి, అశ్వత్థ నారాయణుడు, పూజలు చేస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: శ్రావణమాసం తొలి ఆదివారం సందర్భంగా మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థక్షేత్రంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. శింగరబట్టు, గణపతి, అశ్వత్థనారాయణుడు, శ్రీవల్లిసుబ్రమణ్యేశ్వరస్వాముల చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేసి స్వాములు దర్శించుకున్నారు. కోర్కెలు నెరవేరిన భక్తులు బియ్యం బేడలతోపాటు ముడుపులు, కానుకలు తలనీలాలను సమర్పించి మెక్కులు చెల్లించుకున్నారు. శ్రావణ మాసంలో జిల్లా నలుమూలల నుంచి ఎక్కువ మంది భక్తులు క్షేత్రానికి తరలివస్తారని ఈఓ సుబ్రమణ్యం, అర్చకులు బాలసుబ్రమణ్యశర్మ, సుధీర్‌కుమార్‌శర్మ, సునీల్ కుమార్‌శర్మ తదితరులు తెలిపారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకు పూజ, అర్చనలు, మహా నైవేద్యం తదితర పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వ రస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నియోజకవర్గంలోని చెరువులను నింపాలి

గుంతకల్లు రూరల్: రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి గుంతకల్లు నియోజకవర్గంలోని అన్ని చెరువులకు తాగు–సాగునీటిని అందించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ మండల కమిటీ, రైతు సంఘం ఆధ్వర్యంలో కాలువల పరిశీలన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నపుడు పామిడి మండలంలో పర్యటించిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రాగులపాడు లిఫ్ట్ నుంచి పిల్లకాలువల ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులకు హంద్రీనీవా జలాలను పంపిణీ చేసేందుకు రూ.42 కోట్లు ప్రకటించారన్నారు. ఆ తరువాత వైఎస్సార్‌సీపీ హయాంలో ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఎంతగానో శ్రమించి పనుల నిర్వహణకు రూ.43 కోట్లు నిధులు కూడా ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిపారన్నారు. పిల్ల కాలువల ఏర్పాటులో భాగంగా భూసేకరణ జరుగుతున్న సమయంలోనే ఎన్నికలు రావడంతో తిరిగి ఆ బాధ్యత తెలుగుదేశం పార్టీపై పడిందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నియోజకవర్గంలోని 40 గ్రామాలకు హంద్రీనీవా జలాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.లేనిపక్షంలో భవిష్యత్‌లో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.



దోనిముక్కల పొలాల్లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

రాగా ప్రభు విక్రమ్ లఘుచిత్రం విడుదల

అనంతపురం కల్చరల్: అనంత యువకుడు కల్లూరు అర్జున్ కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించి నిర్మించిన రాగా ప్రభు విక్రమ్ లఘుచిత్రాన్ని విడుదల చేశారు. ఆదివారం స్థానిక నీలిమ థియేటర్‌లో జరిగిన ప్రారంభోత్సవంలో పలువురు టీవీ, సినీ కళాకారులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. నిర్మాత జీఎం సురేష్, అబ్బా టీవీ వ్యవస్థాపకుడు డాక్టర్ హరిప్రసాద్, మాట్లాడారు. జిల్లాకు చెందిన కల్లూరు కుటుంబం వారు దశాబ్దాలుగా సాహిత్య రంగంలో నిష్ణాతులై ఎన్నో మంచి రచనలను అందించారని తెలిపారు. ముఖ్యంగా ప్రఖ్యాత కవి కల్లూరు అహోబిళరావు తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఆయన మనవడైన కల్లూరు అర్జున్ ఇదివరకే ప్రభుత్వం అందించే అవార్డులను దక్కించుకుని జిల్లా కీర్తిని పెంచాడని పేర్కొన్నారు. మరోసారి ఆయన దర్శకత్వంలో వస్తున్న లఘుచిత్రాన్ని అన్ని సాంఘిక మాధ్యమాల్లో విడుదల చేస్తామన్నారు. జిల్లాలోని ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా మరిన్ని చిత్రాలు నిర్మిస్తామని తెలిపారు. అంతకు ముందు థియేటర్‌లో ప్రదర్శించిన ప్రివ్యూ షోలో వందలాది మంది కళాభిమానులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా సుంకలమ్మ విగ్రహ ప్రతిష్ట



పూజలందుకుంటున్న సుంకలమ్మ అమ్మవారు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు కొండకింద కొట్టాలలో ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో సుంకలమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సుంకలమ్మ ఆలయంలో ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, హోమం చేసి, ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజ లు నిర్వహించి విగ్రహ ప్రతిష్ట చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఇసుక టిప్పర్ పట్టించిన గ్రామస్తులు

శింగనమల: మండలంలోని ఇరువెందల గ్రామ సమీపంలోని వంక నుంచి టీడీపీ కార్యకర్తలు ఇసుకను టిప్పర్ ద్వారా అక్రమంగా తరలిస్తుండగా.. గ్రామస్తులు అడ్డుకుని టిప్పర్‌ను పోలీసులకు పట్టించిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. మండలంలో పెన్నానది, కూతలేరు వంక, ఇరువెందల వంక నుంచి టీడీపీ కార్యకర్తలు అక్రమంగా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.. ఈ ప్రాంతాల నుంచి ఇసుకను తరలిస్తున్న సమయంలో వాహనాలను పోలీసులు సీజ్ చేయడం, వాటికి అపరాధ రుసుం వేస్తుంటారు. అపరాధ రుసుం చెల్లించిన వెంటనే మళ్లీ ఇసుకను అక్రమంగా తరలించడం చేస్తున్నారు. పోలీసులు కూడా టీడీపీ కార్యకర్తలపై విసుగు చెందుతున్నారు. చివరకు పోలీసులు టిప్పర్ వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నారు. ప్రస్తుతం పట్టుకున్న టిప్పరుపై కేసు నమోదు చేశారు.



ఇరువెందుల గ్రామస్తులు పట్టించిన టిప్పర్

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి రూరల్: మండలంలోని చుక్కలూరు క్రాస్‌లో ఆదివారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేశామని సెబ్ అధికారులు తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు చేసి ట్రాక్టర్లతో పాటు డ్రైవర్లను అప్‌గ్రేడ్ రూరల్ పోలీసు స్టేషన్‌కు కేసు నమోదు కోసం తరలించామన్నారు.

ఇసుక తరలింపుపై ఉక్కుపాదం

పామిడి: పట్టణ సమీపంలోని పెన్నానది నుంచి ఇసుక అక్రమ తరలింపుపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. టీడీపీ అధికారం వచ్చాక ఇసుక దోపిడీ అధికమైంది. రాత్రికి రాత్రికి టిప్పర్లు, ట్రాక్టర్లలో తెల్లబంగారం అక్రమ రవాణా జోరందుకుంది. ఇది అక్రమార్కులకు కాసులపంట కురిపిస్తోంది. దీంతో అప్రమత్తమైన సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. రాత్రిళ్లు పెన్నా పరివాహక ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేశారు. అక్రమంగా తరలివెళ్తున్న ఇసుక ట్రాక్టర్లను, టిప్పర్లను సీజ్ చేసి అక్రమార్కులపై కేసులు నమోదు చేశారు. అక్రమార్కులు ఎంతటివారైనా ఉపేక్షించకుండా ఇసుక అక్రమ రవాణాను నిరోధించి ఉక్కుపాదం మోపారు. దీంతో ఇసుక అక్రమంగా రవాణా చేపట్టేందుకు అక్రమార్కులు వెనుకాడుతున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటే, భూగర్భజలాల పెంపొందుతాయని మండలవాసులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

అరవింద్ కుటుంబానికి అండగా ఉంటా



మృతదేహం వద్ద అంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: అరవింద్ కుటుంబానికి అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి భరోసా ఇచ్చారు. పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అరవింద్ మృతిపై మాజీ ఎమ్మెల్యే సంతాపం తెలిపారు. ఆదివారం హనుమేష్‌నగర్‌లోని మృతుడి నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. అరవింద్ కుటుంబసభ్యులకు వైవీఆర్ రూ.20 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహాలక్ష్మి, లింగన్న, మాజీ కౌన్సిలర్ రంగన్న, పార్టీ యువనాయకుడు వాల్మీకి శివ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ సీఐగా రాజశేఖర్‌రెడ్డి



గుత్తి: గుత్తి ఇన్‌చార్జ్ సీఐగా పామిడి సీఐ రాజశేఖర్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న వెంకటరామిరెడ్డి నంద్యాల జిల్లా ప్యాలిపికి బదిలీ అయ్యారు. అయితే గుత్తికి నూతన సీఐని నియమించలేదు. దీంతో పామిడి సీఐ రాజశేఖర్‌రెడ్డిని ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఈ క్రమంలో గుత్తి ఇన్‌చార్జ్ సీఐగా రాజశేఖర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకి ఎస్‌ఐ నబీ రసూల్, ఏఎస్‌ఐ నాగమాణిక్యం, ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ నాగేంద్ర శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

యాడికి: మండల కేంద్రంలోని అగాపే వృద్ధాశ్రమంలో ఆదివారం యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్ భార్య సుశీలమ్మ 4వ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు ప్రసాద్, కాసా చంద్రమోహన్ కుటుంబ సభ్యులు ప్రశాంత్, ఉసారాణి, జస్విన్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ టోర్నీ నిర్వాహకుడికి సన్మానం



నాగార్జునను సత్కరిస్తున్న ఆంధ్రా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు


గుంతకల్లుటౌన్: ప్రపంచ చదరంగ సమాఖ్య ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గిన్నిస్‌బుక్ రికార్డు కోసం గత నెల 20న గుంతకల్లులో రాష్ట్రస్థాయి చెస్ పోటీలను నిర్వహించిన టోర్నీ డైరెక్టర్ కె.నాగార్జునను ఆంధ్రా చెస్ అసోసియేషన్ సత్కరించింది. ఆదివారం విశాఖ వాల్తేరు క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో చెస్ అభివృద్ధికి పాటుపడుతున్న నాగార్జునను సన్మానించారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

గార్లదిన్నె: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఈరమ్మ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ కార్యక్రమానికి మండల స్థాయి ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు అందజేసి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు.

యల్లనూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని , గైర్హాజరైతే కలెక్టరుకు నివేదికలు పంపుతానని తహసీల్దారు నాగరాజు హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అర్జీదారులు సోమవారం ఫిర్యాదు చేసేందుకు వచ్చినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలన్నారు.

నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సమన్వయకర్త వీరాంజనేయులు

శింగనమల: శింగనమలలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉద్దాల నారాయణస్వామి కుమారుడు వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగేంద్ర అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతదేహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, బెస్త వెంకటనారాయణ, అబ్దుల్, లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

యల్లనూరు: 2024–2025 ఏడాదికి సంబంధించి గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై సోమవారం నుంచి 14వ తేదీ వరకూ శిక్షణ తరగతులు ఉంటాయని ఎంపీడీఓ వీరరాజు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు, పారిశుద్ధ్యం, చెత్త నుంచి సంపద తయారీ విధానంపై శిక్షణ ఉంటుందన్నారు.

నేటి నుంచి సామర్థ్య పరీక్షలు

యల్లనూరు: మండలంలోని చిలమకూరు మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు సీబీఎస్‌సీ సిలబస్ సామర్థ్య పరీక్షలను సోమవారం నుంచి 17వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మహేష్ ఆదివారం తెలిపారు. మోడల్ స్కూల్లో ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమై 12గంటలకు ముగుస్తుందన్నారు. మోడల్ స్కూల్లో 58 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. విద్యార్థులంతా పరీక్షలకు హాజరుకావాలన్నారు.

రేపు 'హర్ ఘర్ తిరంగా' యాత్ర



మాట్లాడుతున్న మంజుల వెంకటేష్

గుంతకల్లుటౌన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 13న యాత్ర నిర్వహిస్తున్నట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు రవితేజ తెలిపారు. ఆదివారం స్థానిక ఇల్లూరు భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 13వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక రైల్వేగ్రౌండ్ నుంచి బీరప్పగుడి సర్కిల్ వరకూ నిర్వహించే హర్ ఘర్ తిరంగా యాత్రకు విద్యార్థులు, దేశభక్తులు, పురప్రజలు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఎం.కేశవ, పట్టణ ఉపాధ్యక్షుడు రవీంద్ర, నాయకులు లింగా, నవీన్, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

వృద్ధుడిపై దాడి.. ముగ్గురిపై కేసు



గాయపడిన రామాంజనేయులు

గుత్తి: మద్యం మత్తులో రామాంజనేయులు అనే వృద్ధుడిపై దాడి చేసి గాయపరిచిన ముగ్గురి యువకులపై ఆదివారం ఎస్‌ఐ నబీ రసూల్ కేసు నమోదు చేశారు. వివరాలు.. గుత్తి అనంతపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు అనే వృద్ధుడు శనివారం గుత్తి శివారులోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఉండగా ఊబిచెర్లకు చెందిన వెంకటేష్, మల్లికార్జున, వన్నేదొడ్డికి చెందిన సునీల్‌కుమార్ మద్యం తాగి అకారణంగా గొడవ పెట్టుకున్నారు. అంతటితో ఆగకుండా వృద్ధుడిపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గన్నెవారిపల్లి కాలనీలో చోరీ

తాడిపత్రి రూరల్: మండలంలోని గన్నెవారిపల్లి కాలనీలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన చోరీలో జత కమ్మలు, ఇతర వస్తువులు అపహరణకు గురయ్యాయని పోలీసులు తెలిపారు. కాలనీలో ఉంటున్న రాజశేఖర్ ఇటుకల ఫ్యాక్టరీ నడుపుతున్నాడు. ఇంటికి వేసిన తాళం పగులకొట్టిన దొంగలు బీరువాలోని వస్తువులను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఘనంగా ఆరాధనోత్సవం



ప్రసంగిస్తున్న సువర్ణమ్మ

పామిడి: పామిడితో పాటు మండలంలోని అన్ని చర్చిలో ఆదివారం ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్‌ఐ చర్చిలో జరిగిన ఆరాధనోత్సవ కార్యక్రమంలో పాస్టరమ్మ సువర్ణమ్మ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీస్తు బాప్తీస్మము పొంది, ఆయనకు మహిమకరంగా జీవించినప్పుడు జీవితాలు ధన్యకరమవుతాయన్నారు. క్రీస్తుతోనే నిత్యజీవం ప్రాప్తిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, వీరయ్య, జకరయ్య, దేవదాసు, కరుణాకర్, రాజు, అశోక్, ప్రసాద్, రజని, వాణి, లత, రమాదేవి, సుశీలమ్మ, రేచెల్, అంజలి తదితరులు పాల్గొన్నారు.